క్లుప్తంగా

పేద మహిళలకు చీరల పంపిణీ



గైగోలుపాడులో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పాలిక నరసింహమూర్తి

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని పేద మహిళలు సుమారు వంద మందికి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పాలిక నరసింహమూర్తి ఆదివారం చీరలు పంపిణీ చేశారు. గైగోలుపాడులోని మూర్తి స్కూల్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ పేదలకు తన వంతుగా సహకారం అందిస్తానని చెప్పారు. ఇందులో భాగంగానే మహిళలు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశానన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు మాట్లాడుతూ సంపాదనలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. పేదలకు చీరలు పంపిణీ చేసిన నరసింహమూర్తిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు గుబ్బల విజయ్, మూర్తి స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీ డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గమిదే..

బోట్‌క్లబ్: కాకినాడ నగర ఐటీ డీలర్ల సంఘ ఎన్నికలు ఆదివారం స్థానికంగా నిర్వహించారు. సంఘ మాజీ అధ్యక్షుడు కేవీఆర్ మూర్తి, సెక్రటరీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. నూతన అధ్యక్షుడిగా చోడవరపు పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ కరీమ్, సెక్రటరీగా నారాయణమూర్తి, ట్రెజరర్‌గా రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా మల్లిబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను పలువురు సత్కరించారు.

బాధితుడి కుటుంబానికి అండగా..



వెంకట్రావు పిల్లలకు పుస్తకాలు అందిస్తున్న సతీష్‌బాబు, హరీష్

బోట్‌క్లబ్: అనారోగ్య కారణాలతో మంచానికే పరిమితమైన వెంకట్రావు కుటుంబాన్ని ఆదుకునేందుకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ముందుకు వచ్చింది. బాధితుడి పిల్లల చదువులను, కుటుంబ బాధ్యతను తాము తీసుకున్నట్టు ట్రస్ట్ సెక్రటరీ బాపిరాజు తెలిపారు. కాకినాడ రూరల్ మండలం పెనుమర్తి గ్రామంలో భీమాబత్తుల వెంకట్రావు న్యూరాలజీకి సంబంధించిన సమస్యతో ఐదేళ్లుగా మంచానికే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, సెక్రటరీ బాపిరాజు ఆయన పిల్లల చదువులకు అవసరమైన పుస్తకాలను ఆదివారం అందించారు. కుటుంబ పోషణ కోసం వారి ఇంటి వద్దే హోటల్ నిర్వహణకు షెడ్డు నిర్మించేందుకు హామీ ఇచ్చారు. షెడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి, త్వరలో నిర్మించి ఇస్తామని తెలిపారు.

హాస్టల్ విద్యార్థి అదృశ్యం



బేడ రాజు(ఫైల్)

కరప: గొడ్డటిపాలెం హాస్టల్‌కు చెందిన 16 ఏళ్ల విద్యార్థి అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని కరప ఏఎస్సై వి.సూరిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం, కాకినాడ రూరల్ మండలం చీడిగ హాస్టల్ వార్డెన్ బుదాల తబితకు 2009లో మూడున్నరేళ్ల బేడ రాజు, ఐదేళ్ల వయస్సున్న అతని అక్క అరట్లకట్ట గ్రామంలో దొరికారు. వారిని తెచ్చి కరప మండలం గొడ్డటిపాలెంలోని హాస్టల్ (జీవనజ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్)లో ఉంచి చదివిస్తున్నారు. ప్రస్తుతం అరట్లకట్ట హైస్కూలులో రాజు ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గొడ్డటిపాలెం హాస్టల్‌లో ఉంటున్న రాజు ఈ నెల 4న తెల్లవారుజామున ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి గొడ్డటిపాలెం, పరిసర గ్రామాల్లో గాలించినా అతడి ఆచూకీ తెలియలేదు. దీంతో చీడిగ వార్డెన్ తబిత ఆదివారం రాత్రి కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న ఆందోళన

సామర్లకోట: రాక్ సిరామిక్స్‌లో కార్మికులను అక్రమంగా తొలగించి 78 రోజులు గడచినా, వారిని విధుల్లోకి చేర్చుకోవడం లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.కాంత్రికుమార్ ఆరోపించారు. నెల రోజులుగా ఫ్యాక్టరీ గేటు ఎదురుగా కార్మికులు చేస్తున్న ఆందోళన ఆదివారమూ కొనసాగింది. స్థానిక ఏడీబీ రోడ్డులో కొనసాగుతున్న వీరి ఆందోళనకు అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు మద్దతు తెలిపారు. పెద్దాపురం ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దాడి బేబి, ఎస్తేర్‌రాణి, నాగమణి, దేవి మాట్లాడారు. కార్మికుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు.

స్మార్ట్‌గా వాచ్‌చేస్తూ..

- మనిషి కదలికలన్నీ స్మార్ట్ వాచ్‌లో నిక్షిప్తం
- జీవితంలో కీలక పరికరంలా మారుతున్న వైనం
- యువతను ఆకట్టుకుంటున్న ఆధునిక గడియారం
- ఆరోగ్యంతో పాటు.. మరెన్నో ఫీచర్లు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్మార్ట్ వాచ్‌లు

బోట్‌క్లబ్: ఆధునిక మానవుడి కార్యకలాపాలన్నీ సాంకేతికతతో ముడిపడుతున్నాయి. దైనందిన జీవితంలో సాంకేతిక పరికరాలు కీలకంగా మారాయి. ఇప్పుడు గుండె చప్పుడు కూడా లెక్కగట్టి, కళ్ల ముందుంచే స్మార్ట్ వాచ్‌లు కూడా మనిషి బతుకులో భాగమవుతోంది.

వాచ్ అంటే పాత కాలంలో టైం కోసమో, తేదీలు తెలియడానికో ఉపయోగించేవారు. నేడు స్మార్ట్‌వాచ్‌లు అందుబాటులోకి వచ్చాయి. సెల్‌ఫోన్‌లో ఉండే ఫీచర్స్ దాదాపు అన్నీ అందులో ఉండడంతో యువత వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ద్విచక్ర వాహనం, కార్లు నడిపేవారు సెల్‌ఫోన్ మోగితే మాట్లాడడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ స్మార్ట్‌వాచ్‌లో మాట్లాడుకునే ఫీచర్లు ఉండడంతో, ప్రతి ఒక్కరూ వీటిని కొనుగోలు చేసేందుకు ఉత్సుకత ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.వెయ్యి నుంచి రూ.లక్ష విలువైన స్మార్ట్ వాచ్‌లు అందుబాటులో ఉన్నాయి. దాదాపు ప్రముఖ కంపెనీలన్నీ స్మార్ట్ వాచీలు విక్రయిస్తున్నాయి. స్మార్ట్ ఫోన్ల లాగే స్మార్ వాచ్‌లు కూడా అవసరమైన ఫ్యాషన్ ఉపకరణాలుగా మారాయి. ఈ వాచ్‌లు వ్యక్తుల రోజువారీ పనులు కూడా సులభతరం చేసే అనేక ఫీచర్లను కలిగి ఉంటున్నాయి. ఆధునాతన ఫీచర్లతో కెమెరా, సిమ్ కార్డ్ ఆప్షన్లు కూడా ఉన్నాయి.

అన్ని దుకాణాల్లో..

కాకినాడ నగరంలో సెల్‌ఫోన్ విక్రయించే ప్రతి దుకాణంలోను ఈ స్మార్ట్ వాచ్‌లు అందుబాటులో ఉన్నాయి. నగరంలో సుమారు 130 దుకాణాల్లో స్మార్ట్‌వాచ్‌లు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క దుకాణంలో ప్రతి రోజు మూడు నుంచి 4 వాచ్‌లు విక్రయిస్తున్నారు. నగరంలో సుమారు 20కి పైగా పెద్ద షోరూమ్‌లున్నాయి. పెద్ద షోరూమ్‌లో 10 నుంచి 20 వాచ్‌లు విక్రయిస్తున్నారు. మగవారితో పోటీపడి మరీ ఆడవాళ్లు స్మార్ట్ వాచ్‌లు కొనుగోలు చేస్తున్నారని దుకాణదారులు చెబుతున్నారు.

బ్లూటూత్ ఆప్షన్

స్మార్ట్‌వాచ్‌లో బ్లూటూత్ ఆప్షన్ ఉంటుంది. ఇది గొప్ప కాంబో ఆఫర్. ఈ వాచ్‌ల్లో టూత్ పరికరాలను కూడా అందుబాటులో ఉంటున్నాయి. ఈ వాచ్ ఉపయోగించి ఫోన్ కాల్స్‌ను స్వీకరించవచ్చు. డయల్ కూడా చేయవచ్చు. మెసేజ్‌లు కూడా పంపించవచ్చు. సోషల్ మీడియా నోటిఫికేషన్లు కూడా ఫోన్‌లో అందుబాటులో ఉన్నాయి.





మార్కెట్‌లో అందుబాటులో ఉన్న స్మార్ట్‌వాచ్‌లు

ఎంతో ఉపయోగకరం



మా నాన్న పుట్టిన రోజు గిఫ్ట్‌గా నాకు స్మార్ట్ వాచ్ ఇచ్చారు. ప్రతి రోజు నేను ఎన్ని అడుగులు వేస్తున్నాను. ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తున్నానో ఈ వాచ్‌లో తెలుస్తుంది. వాచ్‌లో ఎన్నో ఫీచర్లు చాలా బాగా ఉపయోగపడుతున్నాయి.

– టి.ప్రశాంత్, యువకుడు, కాకినాడ

ఆరోగ్య పరిరక్షణలో..

నేటి కాలంలో చాలా మంది వ్యక్తులు రోజంతా తమ కంప్యూటర్ల ముందు కూర్చుని పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాంటి సమయాల్లో వ్యక్తి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. స్మార్ట్ వాచ్‌లు ఉంటే వారి కార్యాచరణ, నిద్ర, మంచినీరు తాగడం, ఎక్కువ సేపు కూర్చుని ఉంటే నిలబడాలని సూచించడం విలువైన అంశాలను ఇవి అందిస్తున్నాయి. దీంతో మనం ఏ సమయానికి ఏం చేయాలనే అంశాలపై క్లారిటీ వస్తుంది. శరీర ఉష్ణోగ్రత, హృదయ స్పందన రేటునూ ఇది తనిఖీ చేస్తుంది.

మెరుగైన వ్యాయామానికి..

ఈ స్మార్ట్‌వాచ్‌లు మెరుగైన వ్యాయామం చేసేందుకు దోహదపడుతున్నాయి. ఫిట్‌నెస్ లక్ష్యాలను పర్యవేక్షించడం, ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతున్నాయి. హార్ట్‌బీట్ నోటిఫికేషన్, వ్యాయామం చేస్తున్నప్పుడు తమను తాము ఎక్కువగా శ్రమించడంపై హెచ్చరికలు జారీ చేస్తుంది. ప్రతి రోజు ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తున్నారో తెలుపుతుంది.

నేడు వైఎస్సార్ జయంతి

కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ కాకినాడ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చెరువు సెంటర్‌లోని మహానేత కాంస్య విగ్రహానికి ఉదయం 9 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు కూడా నిర్వహిస్తామన్నారు. ఆయా కార్యక్రమాలకు పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు విచ్చేస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా కార్యక్రమాలకు తప్పక హాజరుకావాలని కోరారు.

రమణయ్యపేట వైద్యనగర్‌లో..

కాకినాడ రూరల్: తెలుగు ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను కాకినాడలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జయంతి వేడుకలు నిర్వహించి వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించనున్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమానికి హాజరుకావాలని కన్నబాబు కోరారు.

స్మార్ట్ సిటీలో వెలగని వీధి లైట్లు

కాకినాడ సిటీ: స్మార్ట్ సిటీ కాకినాడ నగరంలో వెలగని వీధి దీపాలు ఎక్కువగా ఉన్నాయని, దాదాపు 40 శాతం మేర దీపాలు వెలగడం లేదని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం విలేకర్లకు తెలిపారు. నగరంలోని శాలిపేట, జవహర్‌వీధి వంటి ప్రధాన రహదారుల్లో అంధకారం ఎక్కువైందన్నారు. అదే విధంగా 35, 39, 40, 42, 13, 24, 11, 8, 3, 12, 33, 46 డివిజన్లలోని పలు వీధుల్లో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చీకట్లో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, పాదచారులు, మోటారు సైకిళ్లపై వెళ్లేవారిని తరుముతున్నాయన్నారు. ప్రజల ఫిర్యాదులతో ప్రమేయం లేకుండా కార్పొరేషన్ అధికారులు వెలగని వీధిదీపాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో స్థానిక కమిటీలతో పబ్లిక్ డిమాండ్‌గా రెడ్ నోటీసులు వేలాడదీస్తామని స్పష్టం చేశారు.

బొండా ట్రస్ట్ సమావేశం



వైస్ ఛాన్సలర్ ఏవీ కృష్ణంరాజును సత్కరిస్తున్న సభ్యులు

కరప: ట్రస్ట్ ఆఫ్ బొండా 17వ అర్ధ సంవత్సర సమావేశం వేళంగిలో ఆదివారం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు బొండా వెంకన్నారావు సంస్థ పదేళ్ల సేవలను, కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా 300 మంది మహిళలకు చీరలు, వంద మంది పురుషులకు పంచె, తువాళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఏవీ కృష్ణంరాజు, డాక్టర్ ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బొండా సూర్యారావు, బొండా వీరవెంకట సత్యనారాయణమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి

కొత్తపల్లి: కోడి పందేల శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని రమణక్కపేట శివారు కేఎస్ఈజెడ్ భూముల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి మూడు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

భక్తాభీష్ట ప్రదాయిని వారాహి



వారాహి నవరాత్ర ఉత్సవాల్లో పాల్గొన్న కమిషనర్ జె వెంకటరావు.



హోమం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: వారాహి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వేద విజ్ఞాన ప్రతిష్ఠానం ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేట సంస్థ కార్యాలయంలో ఆదివారం విశేష హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నగర ప్రజలందరూ ఆనందంగా జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని కోరారు. పండిత దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ ఆదివారం పుష్యమి నక్షత్రం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలతో పాటు, హోమ కార్యక్రమాన్ని కూడా జరిపిస్తే ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవనం సాగిస్తారన్నారు. వారాహి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని స్మరిస్తూ వేదమంత్రాలతో హోమాన్ని నిర్వహించామని, రెండు హోమాలు జరగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రముఖ జ్యోతిష పండితులు డాక్టర్ పుసులూరి ఫణిశర్మ మాట్లాడుతూ వారాహి అమ్మవారి విశిష్టతను వివరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

అంతకుముందు డయల్ యువర్ కమిషనర్



కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం పదిన్నర గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరిస్తామన్నారు. అలాగే ఉదయం 9:30 నుంచి పదిన్నర వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ఫోన్ నంబర్ 0884–2357800కు సమస్యలు తెలియజేయవచ్చని సూచించారు. ఆయా కార్యక్రమాల ద్వారా ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. వారి విజ్ఞప్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అలరించిన నర్మదేశ్వర నృత్యోత్సవం



నృత్యోత్సవంలో ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

బోట్‌క్లబ్: నృత్యాంజలి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ కాకినాడ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళా మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న నృత్యాంజలి నర్మదేశ్వర నృత్యోత్సవం ఆదివారం వైభవంగా ముగిసింది. సుమారు 400 మంది కళాకారులు 210కి పైగా నృత్యాంశాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. నృత్యోత్సవాల మూడో రోజు కార్యక్రమాన్ని ఎస్ఆర్ స్కూల్ అధినేత భార్గవి రామకృష్ణ, లయన్స్ క్లబ్ సభ్యులు కర్రి ఆదినారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నృత్యాంజలి నిర్వాహకులు హరిలోకేష్ శర్మ, కృష్ణవేణి మాట్లాడుతూ మూడు రోజులుగా చిన్నారులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. ప్రముఖులు స్వామి కృష్ణానంద మహరాజ్, వీఎన్ వరప్రసాద్, జోగా వీరవెంకటరమణ యాదవ్, ఎస్ బద్రి, కె.సుబ్బరాజు నృత్యం చేసిన కళాకారులకు సర్టిఫికెట్లు అందించారు.

స్మార్ట్ సిటీలో ఘనంగా గణేశ్ ఉత్సవాలు



నగర గణేశ్ ఉత్సవ సమితి పదాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

బోట్‌క్లబ్: వినాయక చవితి సందర్భంగా గణపతి నవరాత్రులను స్మార్ట్ సిటీలో అత్యంత ఘనంగా నిర్వహించాలని నగర గణేశ్ ఉత్సవ సమితి తీర్మానించింది. సంస్థ కన్వీనర్ మాలకొండయ్య అధ్యక్షతన ఆదివారం స్థానిక దేవాలయం వీధిలోని పైండా చలమయ్య కల్యాణ మండపంలో సమితి సిటీ, రూరల్ పదాధికారుల సమావేశం జరిగింది. సమితి 35వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 23న వినాయక సాగర్ ప్రాంగణంలో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 168వ జయంతి, ఆగస్టు ఏడున రూరల్‌లో సమితి విస్తృత స్థాయి సమావేశం, ఆగస్టు 15న సాంబమూర్తినగర్ డాల్ఫిన్ కాలనీలో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. నగర, గ్రామీణ ప్రాంతాల్లో గణపతి ఉత్సవాల నిర్వహణకు కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వ అధికారుల పాత్ర, నిమజ్జనం రోజున మద్యం విక్రయాల నిలుపుదల, పాఠశాలల సెలవు తదితర అంశాలపై చర్చించారు. సమితి ప్రతినిధులు దూసర్లపూడి రమణరాజు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, రంభాల వెంకటేశ్వరరావు సాలగ్రామ లక్ష్మీప్రసన్న, పైండా వేంకటనారాయణ పాల్గొన్నారు.

బుద్ధుని మహాస్థూపం సందర్శన



కొడవలిలో బుద్ధుని మహాస్థూపాన్ని దర్శించుకుంటున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీమన్నారాయణ

కొత్తపల్లి: గొల్లప్రోలు మండలం కొడవలిలో ఉన్న బుద్ధుని ధాతుగర్భ మహాస్థూపాన్ని ఆదివారం హైకోర్టు సీనియర్ న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ సందర్శించారు. కొడవలి బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి తరఫున బౌద్ధక్షేత్ర సంరక్షణ కోసం హైకోర్టులో కేసును శ్రీమన్నారాయణ వాదిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పురావస్తు శాఖ రక్షిత కట్టడంగా ప్రకటించిన ఏ పురాతన క్షేత్రంలోనూ తవ్వకాలు జరగరాదని, అందుకు విరుద్ధంగా కొడవలి బౌద్ధ క్షేత్రంలో తవ్వకాలు జరిగాయన్నారు. కొడవలి బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి ఇక్కడ తవ్వకాలను నిలిపివేస్తూ స్టే తీసుకువచ్చామని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను అతిక్రమించి ఆ ప్రాంతంలో అక్రమ మైనింగ్ జరుగుతుందనే విషయం పరిశీలించి, వాస్తవాలను తెలుసుకోవడం కోసం క్షేత్ర పర్యటనకు వచ్చామన్నారు. ప్రధానబౌద్ధ క్షేత్రంలో ఉన్న ధనం దిబ్బ కొండతో పాటు, నామాల కొండ, తురకల కొండ, మైనింగ్ ప్రాంతాలను తమ బృందం పరిశీలించిందన్నారు. వాస్తవాలను హైకోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బౌద్ధ మహాస్థూప పరిరక్షణ సమితి అధ్యక్షుడు పెయ్యల పావన్ ప్రసాద్, కార్యదర్శి కాశి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కూనలమ్మ పదాలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు

బోట్‌క్లబ్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక గాంధీభవన్‌లో కవి రెంటాల వేంకటేశ్వరరావు రచించిన కూనలమ్మ పదాలు, బంగారు తండ్రి పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. జోస్యుల కృష్ణబాబు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తలుగా సాహితీవేత్తలు మంత్రి కృష్ణమోహన్, కాళ్లకూరి శైలజ పాల్గొన్నారు. సంస్థ నగర అధ్యక్షుడు మార్ని జానకిరామచౌదరి వక్తలను పరిచయం చేశారు. కృష్ణబాబు మాట్లాడుతూ రెంటాల వేంకటేశ్వరరావు సాహిత్యం సామాన్య పాఠకుడికి సైతం అర్థమయ్యేలా, సరళమైన రీతిలో, హృదయానికి హత్తుకునేలా ఉంటుందన్నారు. కూనలమ్మ పదాలు గ్రంథాన్ని మంత్రి కృష్ణమోహన్ సమీక్షిస్తూ, ఆరుద్ర రాసిన కూనలమ్మ పదాల్ని గుర్తు చేశాయన్నారు. బంగారు తండ్రి పుస్తకాన్ని శైలజ సమీక్షిస్తూ, చిట్టి కవితలతో గ్రంథస్తం చేసి, రెండు తరాల మధ్య వారధిని అక్షరాల్లో పొదిగి, కుటుంబ విలువలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో అవధానుల మణిబాబు, మాకినీడి, శిరీష, సోమయాజులు, పలువురు కవులు పాల్గొన్నారు.

కారు మబ్బుల్లో.. అరుణ తేజం




అరుణ కిరణాలు ప్రసరించేందుకు ఉదయిస్తున్న భానుడిని ఎప్పుడెపుడు కమ్మేద్దామా అంటూ కారుమబ్బులు కాచుకుని ఉన్నాయా అన్నట్టుగా కనిపించిందీ దృశ్యం. వర్షించేందుకు వరుణుడు సిద్ధంగా ఉండగా, అంబరం నుదుటిన బొట్టు పెట్టినట్టుగా సూర్య భగవానుడు మెలమెల్లగా మేఘాలను చీల్చుకుంటూ వస్తున్న ప్రకృతి మనోహర దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. కాకినాడ కుంభాభిషేకం రేవు పోర్టు ప్రాంతంలో, సాగర తీరాన ఆదివారం ఉదయం కనిపించిన సూర్యోదయ దృశ్యమిది.

– కాకినాడ రూరల్

అంబరాన్నంటిన మరిడమ్మ సంబరం

- ఆలయానికి బారులు తీరిన భక్తులు
- అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం



మరిడమ్మ అమ్మవారు



మరిడమ్మ ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

పెద్దాపురం: ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా తొలి ఆదివారం సంబరాలు అంబరాన్నంటాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భారీ క్యూ కట్టారు. అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు అన్ని చర్యలు చేపట్టారు. తాత్కాలిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ లతాకుమారి పర్యవేక్షణలో సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వెలుగుల సురేష్ భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారుల అంచనా. పలు స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఆదివారం పులిహోర అందజేశారు. పెద్దాపురం బ్రాహ్మణ సేవా సంఘం, సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఘనంగా చేపల వీధి సంబరం

ప్రతి వారం నిర్వహించే వీధి సంబరాల్లో భాగంగా ఈ వారం స్థానిక చేపల వీధి సంబరం అంబరాన్నంటింది. భారీ సంఖ్యలో భక్తులు వీధి సంబరంలో సందడి చేశారు. కోలాటం, మ్యూజికల్ నైట్, కాళీ వేషాలు, దేవతామూర్తుల వేషధారణలు, భారీ విద్యుద్దీపాలంకరణ మధ్య అత్యంత వైభవంగా సంబరం జరిగింది.